## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608




ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 289 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 28 జనవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# మున్సిపల్ ఎన్నికల నగారా

ఫిబ్రవరి 11న పోలింగ్...12 అవసరమైతే రీపోలింగ్
ఫిబ్రవరి 13న కౌంటింగ్ ..అదేరోజు ఫలితం వెల్లడి
16న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక
నేటినుంచే నామినేషన్ల స్వీకరణ..30 వరకు గడువు
31న నామినేషన్ల పరిశీలన...
ఫిబ్రవరి 3 వరకు ఉపసంహరణ
వెంటనే అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
షెడ్యూల్ ప్రకటించిన కమిషనర్ రాణి కుముదిని






హైదరాబాద్, జనవరి 27 (ప్రభాత ఉదయం)

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి 2026 సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు. వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, నేటినుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. ఈ ఎన్నికల ప్రక్రియ ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28వ తేదీ బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్ఈసీ రాణికుముదిని ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. షెడ్యూల్ ..మిగతా 2లో



# మొదలైన జాతర సందడి

నేటినుంచే మేడారం జాతర
పగిడిద్దరాజు, జంపన్నలను చేర్చే ఘట్టం ప్రారంభం
భారీగా ఏర్పాట్లు చేసిన తెలంగాణ ప్రభుత్వం

ములుగు, జనవరి 27 (ప్రభాత ఉదయం)

రెండేళ్లకోమారు జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని ప్రతిష్మాత్మకంగా తీసుకొని ఏర్పాట్లు చేసింది. బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు జాతర సాగనుంది. అమ్మవార్లను గద్దెలకు తీసుకుని రావడం మొదలు..మళల్ఈ అడవికి తరలించే వరకు జాతర సాగుతుంది. ఈ మహా ఘట్టాన్ని సమర్థంగా.. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సన్నద్ధమయ్యాయి. ఈసారి సౌకర్యాల కల్పనతోపాటు నిర్మాణ పనులనూ ఏకకాలం చేపట్టారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు ..మిగతా 2లో

## మొదటి దయ్యం
# సంతోష్ రావే

అతనే గుంపు మేస్త్రీ రేవంత్‌కు గూఢచారి
కెసిఆర్ ఎన్ని ఇడ్లీ తిన్నాడన్నది చేరవేసే ఏజెంట్
మాజీ ఎంపి సంతోష్ రావుపై మండిపడ్డ కవిత




# రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు



కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
పఠాన్‌చెరువులో ఇంటిగ్రేటెడ్ భవనానికి నేడు శంకుస్థాపన
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

ములుగు, జనవరి 27 (ప్రభాత ఉదయం)

తెలంగాణ ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా అత్యుత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత పదేళ్లలో ఆనాటి పాలకుల స్వార్థపూరిత నిర్ణయాల వల్ల రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. గడచిన రెండేళు ్గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాలు, సూచనల మేరకు భ్రష్టుపట్టిన వ్యవస్థను సంస్కరిస్తూ రెవెన్యూ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల ఏర్పాటుపై మంగళవారం నాడు సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ .. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 ..మిగతా 2లో

# విద్య వ్యాపారం కావద్దు

దోచుకుంటున్న కార్పొరేట్ స్కూళ్లు
తాను విద్యామంత్రి అయితే వాటిని మూయించేస్తా
నల్లగొండలో ప్రతీక్ ఫాండేషన్ ద్వారా ప్రభుత్వ స్కూలు నిర్మాణం
8కోట్లతో అత్యాధునికంగా నిర్మించామన్న కోమటిరెడ్డి



నల్లగొండ, జనవరి 27 (ప్రభాత ఉదయం)

కార్పొరేట్ స్కూళ్లలో అధిక ఫీజులతో ప్రజలను దోచుకుంటున్నారని.. తాను విద్యాశాఖ మంత్రి అయితే అలాంటి స్కూళ్లను మూసివేయిస్తానని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. విద్య వ్యాపారం కావద్దని తేల్చిచెప్పారు. మంగళవారం నల్లగొండ టౌన్‌లోని బొట్టుగూడలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను ఆయన ప్రారంభించారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ.. 'నల్లగొండ ప్రజల రుణం తీర్చుకోవడానికే నల్లగొండ మున్సిపాలిటీని కార్పొరేషన్ చేశా. కేంద్రం నుండి నిధులు తెచ్చి నల్లగొండ రూపు రేఖలు మారుస్తానని అన్నారు. నేను ప్రధాని నరేంద్ర మోదీని కలిస్తే వెయ్యి, 2 వేల కోట్ల రూపాయల ..మిగతా 2లో



## ఢిల్లీ హైకోర్టులో
# అకీరా నందన్ పిటిషన్

ఎఐ సాయంతో తను పోలిన నకిలీ మూవీ

న్యూఢిల్లీ, జనవరి 27 (ప్రభాత ఉదయం)

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమారుడు అకీరా నందన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి రూపొందించిన ఓ సినిమాతో తన వ్యక్తిత్వం, గోప్యతా హక్కులను ఉల్లంఘించారని తన పిటిషన్‌లో ఆరోపించాడు. ఏఐ మార్ఫింగ్ డీప్ ఫేక్ టెక్నాలజీతో రూపొందించిన ఈ సినిమాలో తన ముఖ కవళికలు, స్వరం, వ్యక్తిత్వాన్ని ఉపయోగించారని పిటిషన్‌లో అకీరా పేర్కొన్నాడు . ఏఐ సినిమాతో పాటు, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్‌లలో పెద్ద సంఖ్యలో తన పేరుతో నకిలీ ప్రొఫైల్స్, సోషల్ మీడియా పేజీలు ఉన్నాయని, వాటిని తొలగించాలని హైకోర్టును అకీరా నందన్ అభ్యర్థించాడు. అతడి పిటిషన్ స్వీకరించిన హైకోర్టు ప్రతివాదులకు ..మిగతా 2లో

## సింగరేణి బొగ్గు స్కామ్‌పై
## గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన
# కెటిఆర్ బృందం



# మొదలైన జాతర సందడి

మొదటి పేజీ తరువాయి...

వెల్లడించారు. ఒకవైపు వనదేవతల గద్దెల పునర్నిర్మాణ పనులు సాగుతున్న సమయంలోనే లక్షలాది మంది ముందస్తుగా అమ్మలను దర్శించుకున్నారు. ప్రధాన జాతర తేదీల్లో భక్తుల రద్దీ కారణంగా గద్దెల ప్రాంగణం వద్ద అమ్మల దర్శనం ఆషామాషీ విషయం కాదు. ఈసారి గద్దెల పునర్నిర్మాణం నేపథ్యంలో ప్రాకారం విస్తరించారు. రూ.100 కోట్లతో చేపట్టిన ఈ పనులు ఈసారి జాతరకే వన్నె తీసుకొచ్చాయి. విస్తరణ నేపథ్యంలో ఏకకాలంలో 9-10 వేల మంది దర్శించుకొనే వెసులుబాటు ఉంటుందని చెబుతున్నారు. వనదేవతలు సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఒక ఘట్టం మంగళవారం ప్రారంభం కానున్నది. ఊరట్టం పంచాయతీ కన్నెపల్లి గ్రామం నుంచి పోలెబోయిన వంశీయులు మేడారంలోని జంపన్నవాగు ఒడ్డున ఉన్న గద్దెపై రాత్రి 7 గంటలకు జంపన్నను తీసుకురానున్నారు. జంపన్నను ఆదివాసీల్లోని నాలుగో గొట్టుకు చెందిన పోలెబోయిన వంశీయులు దశాబ్దాలుగా కొలుస్తున్నారు. గతంలో ఇంటివద్దనే పూజలు చేసుకునేవారు. 2022 నుంచి జంపన్నను గద్దెకు తీసుకువస్తున్నారు. గతంలో జంపన్నను



తీసుకువచ్చిన పోలెబోయిన సత్యం గతేడాది అనారోగ్యంతో మరణించడంతో ఈసారి అతడి సోదరుడు శ్రీను ఆ బాధ్యతలు తీసుకున్నారు. మేడారం మహాజాతర బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో కొలువైన పెనుక వంశీయుల ఇలవేల్పు, సమ్మక్క భర్త పగిడిద్దరాజును మేడారానికి తీసుకెళ్తారు. మహాజాతర పగిడిద్దరాజు చేరికతో ప్రారంభమవుతుంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే గ్రామంలో పెనుక వంశీయులు పగిడిద్దరాజు ఆలయాన్ని శుద్ధి చేసి ముగ్గులు వేసి మామిడి తోరణాలతో అలంకరిస్తారు. గ్రామంలోని పెనుక వెంటేశ్వర్లు ఇంట్లో పగిడిద్దరాజుకు ఆదివాసీ సంప్రదాయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి పాన్పును ఊరేగింపుగా గ్రామంలోని ఆలయానికి తీసుకెళ్తారు. అనంతరం పడగ రూపంలో పగిడిద్దరాజును పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి ఊరేగింపుగా మేడారానికి బయల్దేరుతారు. అటవీ మార్గంలో కాలినడకన వెళ్తూ మంగళవారం రాత్రి లక్ష్మీపురంలో బస చేస్తారు. బుధవారం ఉదయం మళ్లీ మొదలై మధ్యాహ్నం వరకు మేడారం చేరుకుంటారు. గద్దెలపై పగిడిద్దరాజును ప్రతిష్ఠించడంతో మహాజాతర మొదటి ఘట్టం మొదలవుతుంది.





## మున్సిపల్ ఎన్నికల నగారా

మొదటి పేజీ తరువాయి...

మేరకు 28 నుంచి నామినేషన్ల పక్రియ ప్రారంభం అవుఉతంది. 30తో నామినేషన్ల స్వీకరణ గడవు ముగియనున్నది. 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హత పొందిన వారి జాబితా ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు కాగ,ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తారు. రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక చేపడతారు. మున్సిపల్ ఎన్నికల్లో 53 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు.

## మొదటి దయ్యం సంతోష్ రావే

### అతనే గుంపు మేస్త్రీ రేవంత్‌కు గూఢచారి

### కెసిఆర్ ఎన్ని ఇడ్లీ తిన్నాడన్నది చేరవేసే ఏజెంట్

### మాజీ ఎంపి సంతోష్ రావుపై మండిపడ్డ కవిత

హైదరాబాద్, జనవరి 27 (ప్రభాత ఉదయం)

తాను చెప్పిన మొదటి దయ్యం సంతోష్ రావేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఉద్యమకారులకు ఉద్యమ నాయకుడిని దూరం చేసింది అతనేనని కవిత ఘాటుగా విమర్శించారు. గద్దర్ లాంటి నాయకులు గేటు బయట ఉండాల్సి వచ్చిందంటే దానికి కారణం ఆయనేనని ఆరోపించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన కామెంట్స్ చేశారు. సంతోష్ రావుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'కేసీఆర్ దగ్గర ఉన్న మొదటి దెయ్యం సంతోష్ రావు' అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డికి ప్రధాన గూఢాచారి కూడా సంతోష్ రావేనని ఆరోపించారు.ఫాంహౌస్‌లో కేసీఆర్ ఫుల్ ఇడ్లీ తిన్నారా? సగం ఇడ్లీ తిన్నారా? అనే సమాచారాన్ని రేవంత్‌కు సంతోష్ చేరవేస్తాడని వ్యంగ్యస్త్రాలు సంధించారు కవిత. బీఆర్ఎస్‌లో ఎందరో నేతలతో కన్నీళ్లు పెట్టించిన దుర్మార్గుడు సంతోష్ అని మండిపడ్డారు. ప్రగతి భవన్ గేటు బయట గద్దర్‌ను నిలబెట్టింది, ఈటల బీఆర్ఎస్ సస్పెండ్‌కు కారణం సంతోష్ రావే అని కవిత ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్‌ను ఉద్యమకారులకు, పేద ప్రజలకు దూరం చేశారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తికి అనుకూలంగా కేటీఆర్, హరీశ్ రావులు ట్వీట్లు పెట్టడాన్ని బీఆర్ఎస్ క్యాడర్ గమనించుకోవాలని కవిత సూచించారు. బీఆర్ఎస్‌లో అన్ని దుర్మార్గాలకు కారణం సంతోష్ రావేనని ఆరోపించారు. ఎం రేవంత్‌రెడ్డికి సంతోష్‌రావు గూఢచారి. నేను ముందునుంచి చెబుతున్న దెయ్యం ఆయనే. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ సంతోష్‌కు ఎలాంటి శిక్ష విధిస్తుందనేది వేచి చూడాలి. ఆయనకు శిక్ష పడుతుందన్న నమ్మకం నాకు లేదని కవిత వ్యాఖ్యానించారు. గుంపు మేస్త్రీ రేవంత్ తన గూఢాచారిని ఫోన్ ట్యాపింగ్ కేసులో కాపాడుకుంటాడని.. సిట్ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్సైజ్ పోలీసులంటే గంజాయి సరఫరాదారులు, స్మగ్లర్లకు భయం లేదని కవిత అన్నారు. ఎక్సైజ్ పోలీసులు, అటవీశాఖ సిబ్బంది వద్ద ఆయుధాలు ఉంటేనే భయం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో గృహ హింస పెరిగిపోతోందన్నారు.



## సింగరేణి బొగ్గు స్కామ్‌పై దర్యాప్తు జరిపించండి

హైదరాబాద్, జనవరి 27 (ప్రభాత ఉదయం)

సింగరేణిలో బొగ్గు స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు జరిపించేలా చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్రసమితి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్ట నేతలు లోక్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం బీఆర్ఆర్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సింగరేణిలో దోపిడీ అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చాం. ఆధారాలతో బయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్‌లో వణుకు మొదలైంది. కుంభకోణాన్ని బట్టబయలు చేశాక పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రజల దృష్టి మళ్లించేందుకే ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ పేరిట ఒక్కొక్కరిని పిలుస్తున్నారు. సీఎం అంటే కోల్ మాఫియా నాయకుడిగా సింగరేణి కార్మికులు భావిస్తున్నారు. ఫుట్‌బాల్ ఆటకు రూ.10కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేశారు. స్కామ్‌ల విషయంలో పాలకుల నుంచి స్పష్టమైన జవాబు లేదు. ఓబీ టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనతో పారదర్శకతకు పాతరేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సింగరేణి టెండర్లలో నిబంధనలు పెట్టారు. నిబంధన పెట్టిన 9 నెలల్లో ఎందరు కాంట్రాక్టర్లు సందర్శించారు. సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. రింగ్ మాస్టర్ సృజన్‌రెడ్డి.. సీఎం బావమరిదేనా? కాదా? స్పష్టత ఇవ్వాలి. కాంట్రాక్టర్లను రింగ్ చేసి ప్రజాధనం దోపిడీకి యత్నిస్తున్నారు. ప్రభుత్వం రూ.వేల కోట్లు కొల్లగొడుతోందని సింగరేణి కార్మికులు గుర్తించాలి. సింగరేణి కుంభకోణాన్ని అడ్డుకోవాలని గర్నవర్‌ను కోరాం' అని కేటీఆర్ తెలిపారు.

## రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు

మొదటి పేజీ తరువాయి...

క్లస్టర్‌లుగా విభజించి ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని నిర్మాణంతో పాటు ఐదు సంవత్సరాల నిర్వహణాబాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని తెలిపారు. మూడు నుంచి ఐదు ఎకరాల స్థలంలో కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని వివాహ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజీ హాల్, గర్భిణీలకు, వృద్ధులకు ప్రత్యేక వసతులు, విశాలమైన వెయిటింగ్ ఏరియా మహిళల కోసం ఫీడింగ్ రూమ్, చిన్నపిల్లల కోసం క్రెచ్, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యం తదితరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మిగిలిన కార్యాలయాలకు శంకుస్థాపనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండవ విడతలో జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తామని ఇందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని జూన్ 2వ తేదీ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల మేడ్చల్ జిల్లాలో భవనానికి శంకుస్థాపన చేయడం జరిగిందని పఠాన్ చెరువు-శంకరపల్లి ప్రధాన రహదారి సమీపంలో రాజపుష్ప కనస్ట్రక్షన్ నిర్మించే ఇంటిగ్రేటెడ్ భవనానికి బుధవారం నాడు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, ఈ ఆధార్ సంతకం వంటి సౌకర్యాలతో ప్రజల సమయాన్ని ఎంతో ఆదా చేశామని అన్నారు. రెవెన్యూ శాఖలో తీసుకుంటున్న ఈ సంస్కరణలు కేవలం కార్యాలయాల మార్పు మాత్రమే కాకుండా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే సంస్కరణలుగా నిలుస్తాయని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## ఢిల్లీ హైకోర్టులో అకీరా నందన్ పిటిషన్

మొదటి పేజీ తరువాయి...

నోటీసులు జారీ చేసింది. ఏఐ సాయంతో తీసిన ఓ లవ్ స్టోరి సినిమాపై హైకోర్టు నిషేధం విధించింది. కృత్రిమ మేధస్సు, డీప్ ఫేక్ సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా అకీరా నందన్ పేరు, ఇమేజ్, పోలిక, స్వరం, వ్యక్తిత్వాన్ని ఉపయోగించడం దోపిడీ చేయడమేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వక్రీకరించిన కంటెంట్‌ను రూపొందించడం అతని గోప్యతా హక్కును ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంది. వీడియోకు సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలు తొలగించాలని, ఐపి వివరాలను బహిర్గతం చేయాలని మెటా, యూట్యూబ్, ఇన్ స్టాగ్రామ్, ఫేస్ బుక్ , ఎక్స్ సంస్థలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు విచారణ జస్టిస్ తుషార్ రావు ధర్మాసనం ముందు జరిగింది. అకీరా నందన్ తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. గూగుల్ తరఫున ఆదిత్యా గుప్తా, మెటా తరఫున వరుణ్ పాఠక్ న్యాయవాదులు కోర్టులో హాజరయ్యారు.

## పక్కాప్రణాళికతో పోలీస్ శాఖ సన్నద్ధం

### జాతర కోసం విధుల్లో 13వేల మంది పోలీసులు

### డ్రోన్లు, ఎఐ సహకారంతో శాంతిభద్రతల నిర్వహణ

### విధుల్లో ఉమ్మడి జిల్లా ఎస్పీలు, ఏసీపీలు, డీసీపీలు, డీఎస్పీలు

ములుగు, జనవరి 27 (ప్రభాత ఉదయం)

మేడారం జాతరలో అత్యంత కీలకమైనది పోలీస్ శాఖనే. ట్రాఫిక్‌తో పాటు శాంతిభద్రతల భారం ఆ శాఖపైనే ఉండటంతో పోలీసులు అత్యాధునిక టెక్నాలజీని వాడుతున్నారు. జాతరలో 13వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎస్పీలు, ఏసీపీలు, డీసీపీలు, డీఎస్పీలు కూడా విధుల్లో చేరుతున్నారు. బుధవారం నుంచి నాలుగు రోజులపాటు మేడారం మహాజాతర ఘనంగా జరగనుంది. లక్షలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం 8 జోన్లు, 42 సెక్టర్లుగా జాతరను విభజించి విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. 21 శాఖలకు చెందిన 42,027 మందికి పైగా ఉద్యోగులు, సిబ్బంది మేడారంలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా జాతరలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు ఏఐ సహకారంతో అత్యాధునిక డ్రోన్లు, సీసీ కెమెరాలతో సన్నద్ధం అవుతున్నారు. అలాగే 20 లక్షల మంది భక్తులను సురక్షితంగా జాతరకు చేర్చేందుకు ఆర్టీసీ కార్యాచరణ రూపొందించింది. భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖతో పాటు నీటిపారుదలశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ తదిరత శాఖలన్నీ కూడా సిద్ధమయ్యాయి. భక్తులకు సెల్ సిగ్నల్స్ సమస్య ఉత్పన్నం కాకుండా భారీగా మొబైల్స్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. గత జాతరలో సుమారు 30వేల మంది భక్తులు తప్పి పోయిన నేపథ్యంలో ఈసారి జియోట్యాగ్ బెస్ట్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్ వ్యవస్థను తీసుకవచ్చారు. వృద్ధులు, పిల్లలకు పస్రా, తాడ్వాయి మార్గాల్లో క్యూఆర్ కోడ్ గల జియోట్యాగ్‌లను కడుతారు. దీంతో ఎవరైనా తప్పిపోయినా ఈ ట్యాగ్‌ను స్కాన్ చేస్తే వివరాలు తెలిసిపోతాయి. శబరిమలలో విజయవంతమైన ఈ విధానాన్ని ప్రస్తుతం మేడారంలో అమలు చేస్తున్నారు. అలాగే శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని 12క్రైమ్ బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే పాత నేరస్తులను గుర్తించేందుకు అస్పత్రి ప్రాంగణాలు, పార్కింగ్ ప్రాంతాల్లో ఫేస్ రికగ్నిషన్ సాంకేతికతను వినియోగిస్తున్నారు. అపుమానస్పద వస్తువులను గుర్తించే రియల్ టైమ్ అలర్ట్ సిస్టమ్‌ను కూడా సిద్ధం చేశారు. అలాగే టీజీ క్వెస్ట్ అత్యాధునిక ఏఐ డ్రోన్ వ్యవస్థను జాతరలో వినియోగిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ఎవరు తప్పిపోకుండా, సురక్షిత జాతర లక్ష్యంగా ఏఐ డ్రోన్లు జాతరలో గస్తీ నిర్వహించ నున్నాయి. అలాగే జాతరలో 450 సీసీ కెమెరాలు, 20 డిస్‌ప్లే ప్యానల్స్ వినియోగిస్తున్నారు. కౌడ్ కౌంటింగ్ కెమెరాలు, ఫేస్ రికగ్ననైజేషన్ కెమెరాలను కూడా క్యూలైన్‌లు, అధికంగా భక్తులు ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. అలాగే 42 పార్కింగ్ స్థలాలు, 37 హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు.

## విద్య వ్యాపారం కావద్దు





మొదటి పేజీ తరువాయి...

నిధులైనా ఇస్తారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుంది. నాకు ఉత్సాహం ఉంటే ఎన్నికల్లో మళ్లీ పోటీ చేస్తా. లేకుంటే ప్రతీక్ స్కూల్‌లో విద్యార్థులను చదివిస్తూ జీవితం గడుపుతానన్నారు. ఈ స్కూల్ విద్యార్థులను ఆణిముత్యాల్లా తీర్చిదిద్ది ఐఏఎస్, ఐపీఎస్‌లుగా తయారు చేయాలి. నిజాయితీగా బతికా.. పేద వారికి సహాయం చేశా. చదువంటే ర్యాంకులు మాత్రమే కాదని ఓ ఆలోచన చేశాం. విద్యకు ప్రాధాన్యత ఇచ్చి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నాం. బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలలో పూర్తిగా డిజిటల్ విద్యను అందిస్తాం' అని అన్నారు. సరైన విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని వెంకట్‌రెడ్డి అన్నారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బొట్టుగూడలో అత్యాధునిక వసతులతో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను ఆయన ప్రారంభించారు. రూ.8కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడినా తొలి పదేళ్లలో మన సమస్యలు తీరలేదని మంత్రి అన్నారు. ప్రతి నియోజకవర్గంలో దాదాపు రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని.. కులమతాలకు అతీతంగా విద్యార్థులు చదువుకోవాలన్నది తమ ప్రభుత్వ ఆశయమని చెప్పారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను సర్కారు పాఠశాలల్లో చదివించి మార్పు తీసుకురావాలని ఈ సందర్భంగా కోమటిరెడ్డి సూచించారు. తాను విద్యాశాఖ మంత్రిని అయితే కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు బంద్ చేయడం ఖాయమన్నారు. విద్య వ్యాపారం కాదన్న ఆయన... కార్పొరేట్ విద్యా సంస్థలు పేదలను దోచుకుంటున్నాయని ఆరోపించారు. అత్యాధునిక డిజిటల్ క్లాస్ రూమ్ లు, లైబ్రరీ, ఆడిటోరియం, ఇండోర్ స్టేడియం లతో 8 కోట్ల నిర్మాణ వ్యయంతో 3 అంతస్తుల్లో ఈ స్కూల్ ను నిర్మించారు. ప్రతీక్ ఫౌండేషన్ నిర్మించిన ప్రభుత్వ స్కూల్ ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఆరోగ్యం సహకరిస్తే వచ్చే ఎన్నికల్లో నల్లగొండ నుండే పోటీచేస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున నాణ్యమైన విద్య అందించాలని నిర్ణయం తీసుకుందన్నారు. అభివృద్ధి కోసం తాను ఏది అడిగినా సీఎం కాదనరని చెప్పారు. నల్లగొండ మున్సిపాలిటీనీ అభివృద్ధి చేసేందుకే కార్పొరేషన్ గా మార్చామని అన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి నల్లగొండ కార్పొరేషన్ ను అభివృద్ధి చేస్తానని చెప్పారు. నల్లగొండ పట్టణంలో మరో ఆరు నెలల్లో 24 గంటలు తాగు నీరు అందిస్తానని చెప్పారు. కొడంగల్ కు ఎన్ని నిధులు ఇస్తే తన నియోజకవర్గానికి అన్ని నిధులు ఇవ్వాలని సీఎం ను కోరినట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

## హైదర్ గూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షునిగా

# చెట్టిగారి నరేందర్ రావు నియామకం



చెట్టిగారి నరేందర్ రావు (చిన్న) కు నియామక పత్రాన్ని అందచేస్తున్న మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి లు



చెట్టిగారి నరేందర్ రావు తో పాటు మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి నివాసానికి వెళ్లి న బీ ఆర్ ఎస్ నాయకులు

**రాజేంద్రనగర్, జనవరి 27 (ప్రభాత ఉదయం)**

నాయకత్వం వహించే వారు నిత్యం ప్రజలలో ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి కార్యకర్తలకు సూచించారు. అత్తాపూర్ సర్కిల్ హైదర్ గూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షునిగా చెట్టిగారి నరేందర్ రావు ( చిన్న) ను నియమిస్తు మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి.కార్తీకరెడ్డి, సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి , రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్ తో కలసి మాట్లాడారు. ఇప్పటి వరకు ఓటరు జాబితా లో తమ పేర్లు నమోదు చేయించుకోలేని వారి వివరాలు తెలుసుకుని వారి పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయించాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ కాలువలు, పారిశుధ్య సమస్యలు, మంచి నీరు, విద్యా, వైద్యం, రవాణ, శాంతిభద్రతల లాంటి సమస్యలను తెలుసుకుని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపాలన్నారు. నెలకు ఒక సారైన డివిజన్ స్థాయిలో కార్యకర్తల సమావేశాలను నిర్వహించి కార్యకర్తల సాధక బాదకాలను తెలుసుకోవాలన్నారు. కార్యకర్తలకు అండగా ఉన్నప్పుడే వారు ఎన్నికల సమయంలో మనకు అండగా ఉండి పనిచేస్తారని గుర్తు చేశారు. విద్యావంతుడు, రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన చెట్టిగారి నరేందర్ రావు కు హైదర్ గూడ డివిజన్ పార్టీ బాధ్యతలను అప్పగించడం జరిగిందని, అందరిని కలుపుకుపోయి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి.కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడటానికి యువత సిద్ధంగా ఉండాలన్నారు. హైదర్ గూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చెట్టిగారి నరేందర్ రావు మాట్లాడుతూ, తన పై నమ్మకంతో మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, పి.కార్తీక్ రెడ్డిలు హైదర్ గూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షునిగా నియమించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండ పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు. అందరిని కలుపుకుపోయి పార్టీ ని వచ్చే ఏ ఎన్నికలలోనైన గెలిపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మైలార్దేవుపల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్, సీనియర్ నాయకులు రావుల జంగయ్య, జాలిగం చిత్తారి, గుమ్మకొండ హన్మంత్ రెడ్డి , కొండమీది హరినాథ్, కె నర్సింగ్ రావు, పి.లక్ష్మణ్, ముఖేశ్, పి.జీవన్ దాస్, డి.రమేశ్ ముదిరాజ్, నోముల రాము యాదవ్, ఎడ్లకాడి సూర్యం, గుమ్మడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.





పారిశుధ్య కార్మికుల ను సన్మానిస్తున్న అత్తాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య

# పారిశుధ్య నిర్వాహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహించకూడదు

## అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య

**బుద్వేల్, జనవరి 27 (ప్రభాత ఉదయం)**

పారిశుధ్య నిర్వాహణ లో సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండ ముందుండాలని, అదే సమయంలో ప్రజలను కూడా చైతన్యం చేసి చెత్తను స్వచ్ఛ ఆటోలకు ఇచ్చే విదంగా యూసీడీ విభాగంలో పనిచేస్తున్న రీసోర్స్ పర్సన్స్ అవగాహన కల్పిం చాలని అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య అన్నారు. పీడీపీ చౌరస్తా సమీపంలో గల రాయల్ హయత్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం జరిగిన పారిశుధ్య కార్మికుల అవగాహన సదస్సు లో ఆయన పాల్గొని ప్రసంగించారు. డివిజన్ల వారిగా పారిశుధ్య నిర్వాహణ విషయంలో స్పెషల్ డ్రైవ్ జరుగుతున్నదని గుర్తు చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరిస్తున్న స్వచ్ఛ ఆటోలు ప్రతి రోజు చెత్తను సేకరించాలని గుర్తు చేశారు. బస్తీలలో, ప్రధాన కూడళ్లలో డంప్ చేసే చెత్తను ర్యాంకీ



పారిశుధ్య విభాగం సిబ్బంది నుద్దేశించి మాట్లాడుతున్న అత్తాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య

గ్రూప్ సిబ్బంది వాహనాల ద్వారా ఎప్పటికప్పుడు ఎత్తివేయాలన్నారు. యూసీడీ విభాగంలో ఉన్నటువంటి రీసోర్స్ పర్సన్స్ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను చెత్తను ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకే ఇవ్వాలని అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూసీడీ విభాగం డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ స్వాతి, అత్తాపూర్ సర్కిల్ ఈఈ వెంకట శేషయ్య, శానిటేషన్ విభాగం డీఈ దివ్యజ్యోతి, ఏఈ ఆశీష్ తో పాటు శానిటరీ సూపర్వైజర్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

**12 మంది కార్మికులకు సన్మానం :**

అత్తాపూర్ సర్కిల్ పరిధిలో పారిశుధ్య విభాగంలో ఉత్తమ సేవలు అందిస్తున్న 12 మంది పారిశుధ్య సిబ్బందిని డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య సన్మానించారు. విధులకు గౌరాహాజరు కాకు ండ, నిబద్ధతతో పనిచేస్తున్న వారిని గుర్తించి సన్మానించడం జరిగిందని సమ్మయ్య తెలిపారు.

# రాఘవేంద్ర కాలనీలో ఉచిత వైద్య శిబిరం







రాఘవేంద్ర కాలనీ లో జరిగిన ఉచిత మెఘా వైద్య శిబిరంలో పాల్గొన్న శాసన మండలి సభ్యులు మీర్జా రహ్మత్ బేగ్ తదితరులు



వైద్య సిబ్బందిని అభినందిస్తున్న శాసన మండలి సభ్యులు మీర్జా రహ్మత్ బేగ్

**బుద్వేల్, జనవరి 27 (ప్రభాత ఉదయం)**

: 77వ గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని అత్తాపూర్ సర్కిల్ రాఘవేంధ్ర కాలనీలో నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంపును శాసనమండలి సభ్యులు మీర్జా రహ్మత్ బేగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే ప్రాంతాలలో పెద్ద పెద్ద ఆసుపత్రులు ఉచితంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం సం తోషకరమన్నారు. ప్రజలలో హెల్త్ అవేర్నెస్ తీసుకురావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ హబీబ్ జైన్ ఆరీఫ్, మజ్లిస్ నాయకులు మహ్మద్ ముర్తుజా అలీ, మాజీ కార్పొరేటర్ మహ్మద్ షరీఫ్, మహ్మద్ అబ్రార్ లతో పాటు పలువురు మజ్లిస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలచి రూ 10వేల నగదు బహుమతిని, ట్రోఫీ ని గెలుచుకున్న నగరానికి చెందిన సీ ఎం పీ జట్టు

# ముగిసిన నవజ్యోతి యూత్ క్లబ్ క్రీడా పోటీలు

**బుద్వేల్, జనవరి 27 (ప్రభాత ఉదయం):**

77వ గణతంత్ర దినోత్సవాల సందర్భంగా రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలలో నగరానికి చెందిన సీఎంపీ జట్టు మొదటి స్థానంలో నిలిచి రూ.10వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీ ని అందుకుంది. ద్వితీయ స్థానం లో దర్గా ఖలీజ్ ఖాన్ కు చెందిన క్రీడాకారులు నిలచి రూ.5వేలు, ట్రోఫీని కైవసం చేసుకున్నారు. పాఠశాల స్థాయి కబడ్డీ పోటీలలో రాజేంద్రనగర్ ఎస్టీ బాలుర వసతి గృహం విద్యార్థులు మొదటి స్థానం లో నిలిచి రూ.5వేలు, ట్రోఫీని గెలుచుకున్నారు. ద్వితీయ స్థానంలో రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలచి రూ.3వేలు, ట్రోఫి ని సొంతం చేసుకున్నారు. ఈ పోటీలను నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షులు మంగలారం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్యామల గంగాధర్, క్రీడల కార్యదర్శి ఎం ప్రవీణ్ కుమార్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల సందర్భంగా ప్రముఖ క్రీడాకారులు ఎంకె శ్యాంసన్, ఎం ఎ నయీమ్, బి.పద్మారావు లు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో నవజ్యోతి యూత్ క్లబ్ పాలకమండలి సభ్యులు పి.రవీందర్, మురళీమోహన్. ఈ శ్రీకాంత్, జన్వంత్, ఎం. వినయ్ కుమార్, సాయి సందీప్, డి.నర్సింహ్మారావు, హరినాథ్ లతో పాటు క్లబ్ కు చెందిన పెద్దలు పాల్గొన్నారు.



కబడ్డీ లో ప్రథమ స్థానంలో నిలిచి రూ 5వేలతో పాటు ట్రోఫీ ని గెలుచుకున్న రాజేంద్రనగర్ గిరిజన బాలుర వసతి గృహం విద్యార్థులు



# సీఎం రిలీఫ్ ఫండ్‌లు పేదలకు వరం

## రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

**రాజేంద్రనగర్,జనవరి27(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ లను అందించి వారి వైద్యానికి కృషి చేయడం జరుగుతుందని నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.మంగళవారం నర్సారెడ్డి కాలనీకి చెందిన సాజిద్ అలీకి రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మాజీ మేయర్ మహేందర్ గౌడ్,మాజీ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ లతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ల ద్వారా సహకరించడం జరుగుతుందన్నారు.అవసరమైతే ఎల్ఓసీలను అందించిప్రత్యేకంగా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ మేరకు ప్రజలు తన వద్దకు రావాలని,వారికి అండగా నిలుస్తానని వివరించారు.ఈ కార్యక్రమంలో మస్తాన్ అలీ,నవాజ్ తదితరులు పాల్గొన్నారు.




# గట్టు మైసమ్మ దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలి: వజ్రేష్ యాదవ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఘట్కేసర్ సర్కిల్ ) జనవరి 27 ( ప్రభాత ఉదయం):-**

సర్కిల్ పరిధిలోని గట్టు మైసమ్మ దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని గట్టు మైసమ్మ దేవస్థానానికి నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా డైరెక్టర్లుగా బొక్క జంగారెడ్డి, దేవేందర్ ముదిరాజ్, పుట్ల చెరువు నాగరాజ్, కడు పుల్ల హేమలతల చేత ప్రమాణ స్వీకారం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొని నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు మైసమ్మ దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని అన్నారు. నూతన కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్టీఓ సభ్యులు భీమిడి జయపాల్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, ఘట్కేసర్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యాలు యాదవ్, గడ్డన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచందర్ రెడ్డి, బొక్క ప్రభాకర్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి





### ఎన్నికలు నిష్పక్షపాతంగా, శాంతియుతంగా జరుపుటకు ఏర్పాట్లు

### రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ శ్రీమతి రాణి కుముదిని

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 27(ప్రభాత ఉదయం):**

మున్సిపాలిటీ ఎన్నికలను సమర్థవంతంగా, శాంతియుతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని తెలిపారు, మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డి.జి.పి. శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలలు, మున్సిపల్ కమీషనర్లతో మున్సిపాలటి ఎన్నికల నిర్వహణ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ రాష్ట్రంలో 116 మున్సిపాలటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికల నిర్వహణలకు సన్నద్ధంగా ఉండాలని, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన క్షణం నుంచే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట అమల్లోకి వస్తుందని తెలిపారు, అలాగే ఎన్నికల నియమ నిబంధలకు అనుగుణంగా వ్యవహరించి, ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, పోలింగ్ బూతులలో అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీలలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూడాలని అన్నారు, అలాగే ఎన్నికల ప్రక్రియలో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాటకు అవసరమైన కార్యచరణ ప్రణాళికలను సిద్ధంగా చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికల విజయవంతంగా నిర్వహించారని, అలాగే మున్సిపల్ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయలన్నారు. విదుల్లో ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర డిజిపి శివదర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పోలీసు శాఖ పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు, ఎన్నికల విధుల్లో తగినంత సిబ్బందిని నియమిస్తామని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎన్నికల ప్రవర్తన నియమావళిని కి అనుగుణంగా ఎన్నికలను నిర్వహించేందుకు పక్క ప్రణాళికలను సిద్ధం చేయాలని, ఎన్నికల సామాగ్రిని పరిశీలన అలాగే సిబ్బంది కేటాయింపు తదితర అంశాలపై ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డిసిపి రాజా మహేంద్ర నాయక్, జెడ్పీ సిఇఓ మాదురిషా, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపల్ కమీషనర్లు మహేశ్వర్ రెడ్డి, రాధాకృష్ణ, ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ హిల్స్ అక్రమ 4 సీవరేజ్ కనెక్షన్‌లు కట్

### మరో 4 అపార్ట్‌మెంట్ వాసులకు నోటీసులు

**ఖైరతాబాద్, జనవరి 27 (ప్రభాత ఉదయం)**

జలమండలి నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న 4 అపార్ట్మెంట్ సీవరేజ్ కనెక్షన్ ను అధికారులు తొలగించారు. మరో 4 భవన యజమానులకు నోటీసులు అందించారు. జలమండలి ఓ అండ్ ఎం డివిజన్-15 పరిధి కాకతీయ హిల్స్ కొంత మంది అపార్ట్మెంట్ యజమానులు.. అనుమతి లేకుండానే సీవరేజ్ పైపు లైన్ కనెక్షన్ తీసుకున్నారు. దీంతో పాటు వాటినుంచి నుంచి వచ్చే అధిక సీవరేజ్ వల్ల మెయిన్ రోడ్ పై తరచూ సీవరేజ్ ఓవర్ ఫ్లో అయ్యేది. ఇటీవల స్థానిక అధికారులు పర్యటించిన సమయంలో ఈ విషయం బయటపడటంతో.. ఎండీ ఆదేశాల మేరకు ఈ రోజు 4







అపార్ట్మెంట్ సీవరేజ్ పైపు లైన్ కనెక్షన్ ను తొలగించిన అధికారులు , మరో 4 భవన యజమానులకు నోటీసులు

అందించారు. అక్రమంగా నల్లా, సీవరేజ్ కనెక్షన్లు కలిగి ఉన్న వాళ్లు వాటిని క్రమబద్ధీకరించుకోవాలని ఎండీ అశోక్ రెడ్డి వినియోగదారుల్ని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆసుపత్రులు, హోటళ్లు, బేకరీలు, మాల్స్, తదితర వాణిజ్య, బహుళ అంతస్తు భవన సముదాయాల నిర్వాహకులు తప్పని సరిగా సిల్ట్ చాంబర్లు ఏర్పాటు చేసుకోవాలని పునరుద్ఘాటించారు. జలమండలి అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా తాగునీటి నల్లా, సీవరేజ్ పైపు లైన్ కనెక్షన్లు తీసుకుంటే.. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఎవరైనా అక్రమ నల్లా, సీవరేజ్ కనెక్షన్లు గుర్తిస్తే.. జలమండలి విజిలెన్స్ బృందానికి 9989998100, 9989987135 ఫోన్ నంబర్ల ద్వారా సమాచారం ఇవ్వగలరు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమ ఇసుక దందా..

### పోచన్నపేట గ్రామంలో రైతుల ఆందోళన

### రెవిన్యూ కూపన్లు లేకున్నా, ఉదయం 8 గంటల వరకే వాగులో ఇసుక నింపుతున్న ఇసుక ట్రాక్టర్లు ...

### రైతులను బెదిరిస్తున్న ఇసుక మాఫియా దళారులు...

### అక్రమ ఇసుక ట్రాక్టర్లను అడ్డుకోవడంతో రంగంలోకి దిగిన పలు శాఖల అధికారులు...

**జనగామ జిల్లా ప్రతినిధి జనవరి 27 (ప్రభాత ఉదయం):**





జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట గ్రామంలో గల పెద్దవాగు ఇసుక ను, ఇసుక రవాణా నిబంధనలకు విరుద్ధంగా రేయింబవళ్లు అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతోందని, వాగు పరివాహక రైతులు మంగళవారం ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారిపై తిరుగుబడ్డారు. ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పనుల పేరుతో, అనుమతుల మాటున ఇసుకను కమర్షియల్ అవసరాలకు తరలిస్తూ... లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దోపిడీ వల్ల రైతులు తమ బోరు బావులు ఎండిపోయి భూగర్భ జలాలు పడిపోవడమే కాకుండా, పర్యావరణానికి తీవ్ర ముప్పు కలుగుతోందని, అక్రమ ఇసుక దందా ను ఆపివేయాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం 8 గంటల వరకే దాదాపు 25 ట్రాక్టర్లు పెద్ద వాగులోకి వచ్చాయని, కేవలం నాలుగు ట్రాక్టర్లకు మాత్రమే అనుమతులు ఉన్నాయని, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 3 కోట్ల 30 లక్షలతో ప్రభుత్వం చెక్ డ్యామను వాగు పరివాహక బోరు బావులలో నీటి మట్టం పెరగడం కోసం నిర్మిస్తే, అ చెక్ డాం కిందనే గోతులు తవ్వి ఇసుక దందా రవాణా చేస్తున్నారని మండిపడ్డారు. ఇట్టి ఇసుక దందాపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతోనే ఇసుక దళారులు సొమ్ము చేసుకొని రైతుల పై దాడులు చేస్తున్నారన్నారు. రాత్రివేళ కూడా కొందరు ఇసుక దందాను కొనసాగిస్తున్నారని, ఇప్పటికే తమ భూములు కోతకు గురైన్నాయని, నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి విషయం పై పోలీసు, రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం జరిగిందని, దానివల్ల రైతులు సహకరించాలన్నారు. రెవిన్యూ అధికారులు, రైతుల భూముల వద్ద ఇసుక తోడేయ్యకుండా ప్రభుత్వ పోరంబోకు భూములోనే ఇకనుండి హద్దులు చూపిస్తారని, ఈ ప్రాంగణంలోనే ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలించాలని ట్రాక్టర్ యజమానులకు సూచించారు. రైతులు భూముల వద్ద , చెక్ డ్యాముల వద్ద కానీ, ఇసుకను తోడుస్తే రైతులు తమకు ఫిర్యాదు చేస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని ఎస్ఐ ఎస్కే హమీద్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఏఆర్ఐ మునివర్ , గ్రామ పరిపాలన అధికారి పోశయ్య , గ్రామ రైతులు, ఇసుక వ్యాపారులు, డ్రైవర్లు పలువురు పాల్గొన్నారు.

# డివిజన్‌లో సమస్యలకు తావివ్వకుండా అన్ని చర్యలు చేపడతా:



### శాంతి సాయి జన్ శేఖర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( నాచారం డివిజన్ ) జనవరి 27 ( ప్రభాత ఉదయం):**

నాచారం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో సమస్యలకు తావివ్వకుండా అన్ని చర్యలు చేపడతానని స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేకర్ అన్నారు. మంగళవారం నాచారం డివిజన్ పరిధిలో స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేకర్ ఆధ్వర్యంలో దోమల నివారణకు స్పెషల్ ఫాగింగ్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అన్ని కాలనీలో సమస్యలకు తావివ్వకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని అన్నారు. అందులో భాగంగానే దోమల నివారణకు స్పెషల్ ఫాగింగ్ డ్రైవ్ చేపట్టామని చెప్పారు. మూడు పెద్ద మిషిన్లు నాలుగు చిన్న మెషిన్లతో డివిజన్లోని మూల మూల ప్రతి ఇంటి వరకు ప్రతి వీధిలో ఫాగింగ్ చేయించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ మేకల ముత్యంరెడ్డి, విటల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, మార్కెట్ లక్ష్మణ్, రహీం భాయ్, బిలాల్, ఎంటమాలజీ సూపర్వైజర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ శక్తి గణపతి దేవాలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠ కు రూ.1,51,000 వేల విరాళం అందజేత

### ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

### సామాజిక కార్యకర్త పుప్పాల అజయ్ కుమార్

**కూకట్ పల్లి, జనవరి 27 (ప్రభాత ఉదయం)**

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలుగా ఉంటాయని సామాజిక కార్యకర్త పుప్పాల అజయ్ కుమార్ అన్నారు. హైదరాబాద్ నగరంలోని ఛత్రినాక లోగల శ్రీ శక్తి గణపతి దేవాలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్టాపన ప్రధాన విగ్రహానికి దివంగత పుప్పాల పరమేశ్వరరావు జ్ఞాపకార్థం సతీమణి ప్రమీల దేవి కుటుంబ సభ్యులతో కలిసి ఛత్రినాక వ్యవస్థాపక అధ్యక్షులు పసునూరి పురుషోత్తం చారి, పుప్పాల రఘు, ప్రధాన కార్యదర్శి, రాకేష్ షిండే, కోశాధికారికి రూ. 1,51,000 వేల విరాళాన్ని అందజేశారు. అనంతరం పుప్పాల అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆలయాలకు విరాళం అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటానని, నిరుపేదలకు చేయూతనిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పుప్పాల జ్యోతి, పుప్పాల అనిల్ కుమార్, పుప్పాల అశ్విన్, పుప్పాల ఆదర్శకుమార్, బంటి పుప్పాల, మిఖిల్ పుప్పాల, మనవాళ్లు, మనవరాళ్లు, కుంట అరవింద్ ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందించారు.





## ప్రాణాంతక 'చైనా మాంజా'పై పోలీసుల అవగాహన కార్యక్రమం

### నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

### సీఐ నరసింహ రాజు

**కూకట్ పల్లి, జనవరి 27 (ప్రభాత ఉదయం)**

నగరంలో నిషేధిత 'చైనా మాంజా' మరో పసిప్రాణాన్ని బలిగొన్న ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ విషాద ఘటన నేపథ్యంలో బాలానగర్ పోలీసులు అప్రమత్తమయ్యారు. గాలిపటాల పండుగ వేళ మరిన్ని ప్రాణాలు గాలిలో కలవకుండా ఉండేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మంగళవారం సాయంత్రం ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్డులో బాలానగర్ పోలీసులు బాటసారులకు, వాహనదారులకు చైనా మాంజా వల్ల కలిగే ముప్పును వివరించారు. నైలాన్ లేదా సింథటిక్ దారంతో తయారయ్యే ఈ మాంజా మనుషులకే కాకుండా, పక్షులకు కూడా ప్రాణాంతకంగా మారుతోందని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా బాలానగర్ సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను విక్రయించినా, నిల్వ ఉంచినా లేదా రవాణా చేసినా వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ హనుమయ్య, హెచ్‌జీ మల్లేష్, ఇతర సిబ్బంది పాల్గొని ప్రజలకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు.



## విద్యా అనేది సమాజాభివృద్ధికి పునాది

### ఎమ్మెల్యే రాగిడి లక్ష్మారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఏఎస్ రావు నగర్ డివిజన్ ) జనవరి 27 ( ప్రభాత ఉదయం)**

విద్యా అనేది సమాజాభివృద్ధికి పునాది లాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే రాగిరి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే రాగిడి లక్ష్మారెడ్డి నివాసంలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు హైదరాబాదు నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి చేతుల మీదుగా 5 లక్షల రూపాయల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్య అనేది సమాజాభివృద్ధికి పునాది అని అన్నారు. ముఖ్యంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. అనంతరం నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకుండా ఉండేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఇలాంటి గొప్ప నిర్ణయం తీసుకోవడం అభినందనీయం అని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి వైద్యులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, మహేష్ గౌడ్, రాజు కుమార్, సీత రాము కాలనీ అధ్యక్షుడు రమేశ్ విద్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వేసవి కార్యాచరణపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సమీక్ష..

**ఖైరతాబాద్, జనవరి 27 (ప్రభాత ఉదయం)**

జలమండలి వేసవి కార్యాచరణపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ సమీక్ష సమావేశానికి ఈడీ మయాంక్ మిట్టల్ తో పాటు డైరెక్టర్ లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఈ సమీక్ష సమావేశంలో ఇప్పటివరకు మంజూరు చేసిన వాటర్ సప్లై, సీవరేజ్ పనులు, ఇంకుడు గుంతలు, డీ-సిల్టింగ్ పనులు, ట్యాంకర్ డెలివరీ తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.




**మార్చి నాటికి పనులు పూర్తి..**

ఎండీ మాట్లాడుతూ.. వేసవి కార్యాచరణ అమలుకోసం మొత్తం 12 సర్కిల్ లకు ఒక్కొక్క సర్కిల్ కి ఒక సీజీఎంను అధికారిని నోడల్ ఆఫీసర్ గా నియమించామని అన్నారు. వీరు ఇప్పటివరకు మంజూరు చేసిన మంచినీరు, సీవరేజ్ పనులను మార్చి 31 నాటికి పూర్తి చేసేలాగా యాక్షన్ ప్లాన్ ను రూపొందించుకోవాలని వారికి సూచించారు.

పనులు చేపట్టేటప్పుడు భద్రత, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ పనులు చేపట్టేలా చూసుకోవాలని అన్నారు. పనులు పూర్తిచేసిన అనంతరం వెలువడే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. తవ్వకాలకు చేపట్టిన రోడ్డు పునరుద్ధరణ పనులను ఏప్రిల్ చివరి వారంలోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం రోడ్డు పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తిచేసి నగరవాసులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు.

**18 వేల ఇంకుడు గుంతలను నిర్మించాలి...**

రానున్న 90 రోజుల్లో ఓఆర్ ఆర్ పరిధిలో 18 వేల ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలాగా.. ఒక్కో నోడల్ ఆఫీసర్ 2 వేల ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రణాళికను రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించి అనుమతులు పొందాలని సూచించారు.జలమండలి పరిధిలో 200 గజాల ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత అవసరమని.. 300 గజాల పైనున్న ప్రతీ ప్రాంగణంలో ఇంకుడు గుంత తప్పనిసరిగా నిర్మాణం చేసుకోవాలని ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ నుండి ఓఆర్ఆర్ వరకు భూగర్భ జలాలు పెంచే లక్ష్యంగా ప్రతి నోడల్ ఆఫీసర్ శక్తివంతన లేకుండా పని చేయాలని కోరారు. అలాగే, కొత్త కనెక్షన్ల కోసం వచ్చే దరఖాస్తులను పరిశీలించి.. మంజూరు చేసే సమయంలో ఇంకుడు గుంత తప్పనిసరి నిర్మించేలాగా రెవెన్యూ నియమాలను మార్పు తీసుకొస్తున్నట్లు వెల్లడించారు.

**డీ-సిల్టింగ్ డ్రైవ్..**

రానున్న 4 నెలల్లో జలమండలిలోని పరిధిలోని సీవరేజ్ లైన్ లైన్ లను.. అన్నీ మ్యాన్ హోళ్లను డీ-సిల్టింగ్ చేయాలని అధికారులకు లక్ష్యంగా నిర్దేశించారు. ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపిన 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ మే నాటికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మే చివరి నాటికి అన్ని సివరేజ్ లైన్లు, మ్యాన్ హోళ్ళు డీ సిల్టింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

2024 అక్టోబర్ 2 నుండి డీ సిల్టింగ్ పనులు చేపట్టి.. ఈ రోజు నాటికి నగరంలోని ప్రాంతాల్లో నిర్విరామంగా డీ-సిల్టింగ్ పనులు నిర్వహించారు. ఫలితంగా ఇప్పటి వరకు ఈ డ్రైవ్ ద్వారా 48,887 ప్రాంతాల్లో 6,285 కిలో మీటర్ల సీవరేజ్ పైపులైన్, 4.87 లక్షల మ్యాన్ హోళ్లలో డీ-సిల్టింగ్ పనులు పూర్తి చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్ ఫలితంగా రోజూ వచ్చే సీవరేజ్ ఫిర్యాదులు 20 నుంచి 30 శాతానికి తగ్గాయి.

**24 గంటల్లో ట్యాంకర్ డెలివరీ...**

రానున్న వేసవిలో 24 గంటల్లో ట్యాంకర్ డెలివరీ చేసేలాగా చర్యలు తీసుకోవాలని, దానికి అనుగుణంగా ఫిల్లింగ్ స్టేషన్ లు, ఫిల్లింగ్ పాయింట్ లను అదనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డిమాండ్ ను తట్టుకునేందుకు వీలుగా .. అవసరమైతే అదనపు ట్యాంకర్ లను సమకూర్చుకోవాలని ఆదేశించారు. ట్యాంకర్ బుక్ చేసిన 24 గంటల్లో నీరు సరఫరా చేయాలని అధికారుల్ని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, పర్సనల్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్, ఆపరేషన్ డైరెక్టర్ వినోద్ భార్గవ సీజీఎంలు, జీఎంలు జీఎంలతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి..

**అభయ ఆంజనేయ స్వామి దేవాలయ ధర్మకర్తల సభ్యులు తుంగ రాంరెడ్డి**

**రాజేంద్రనగర్,జనవరి27(ప్రభాత ఉదయం)**

అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని,పంటలు బాగా పండి అందరూ సిరి సంపదలను పొందాలని రాజేంద్రనగర్ ఉప్పర్ పల్లిలోని జనచైతన్య కాలనీ ఫేస్ -1మహాలక్ష్మి రెసిడెన్స్ అభయ ఆంజనేయ స్వామి దేవాలయ ధర్మకర్తల సభ్యులు తుంగ రాంరెడ్డి అన్నారు.ఆలయంలో వెలసిన శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని అమ్మవారికి రెండు రోజులుగా ధర్మకర్తలు పాల్గొని పూజలు ఘనంగా నిర్వహించారు.తెల్లవారుజామున అమ్మవారికి పంచామృత అభిషేకం,అలంకరణ కార్యక్రమం నిర్వహించారు.పెద్దమ్మతల్లిని భక్తులు కోరుకున్న కోరికలను నెరవేరుస్తుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రతి శనివారం దేవాలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు వివరించారు.ఈ పూజా కార్యక్రమంలో దేవాలయ సత్యనారాయణరెడ్డి,సుమన్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,ఇంద్రారెడ్డి,సికిందర్ రెడ్డి,వీరితోపాటు మహాలక్ష్మీ రెసిడెన్స్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.ం



## "వివేకానంద జాతీయ పురస్కారం అందుకున్న డా. మోహనకృష్ణ భార్గవ"

**ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక, సాహిత్య రంగాల్లో సేవలను గుర్తిస్తూ జాతీయ పురస్కారంతో ఘనంగా సత్కరించిన కళానిలయం - జాతీయ సాంస్కృతిక సంఘసేవా సంస్థ..**

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 27(ప్రభాత ఉదయం):**

హైద్రాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్ వేదికగా కళా నిలయం, జాతీయ సాంస్కృతిక సంఘసేవా సంస్థ ఆధ్వర్యంలో భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు, సంక్రాంతి సాంస్కృతిక ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించింది. అందులో భాగంగా జనగామ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక తత్వవేత్త, సామాజిక కవి, రచయిత డా. ఎక్కలదేవి మోహనకృష్ణ భార్గవ కు "వివేకానంద జాతీయ పురస్కారం" ప్రదానం చేసారు. సంస్థ చైర్మెన్ సురేందర్, పుష్పలత నిర్వహణలో ప్రముఖ వక్త దైవజ్ఞ శర్మ సభాధ్యక్షత వహించగా, ప్రముఖ నటుడు గుండు సుదర్శన్, పూర్వ టూరిజం కమీషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, మధుసూధన్ జోషి, ప్రొఫెసర్ చందు ఆంజనేయిలు, పలువురు ప్రముఖులు, విశిష్ట అతిథుల చేతుల మీదుగా శాలువా, మెమెంటో, షీల్డ్, ఫోటోఫ్రేమ్ లతో ఘనంగా సత్కరించారు.. సమాజంలో మార్పు, చైతన్యం తీసుకురావడానికి అనేక సంస్థలు మాధ్యమాల వేదికగా సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, వైదిక, ధార్మిక రంగాలలో మోహనకృష్ణ చేస్తున్న కృషిని కొనియాడారు. వారు సేవలు మరింత విస్తృతంగా ముందుకు సాగాలని గుర్తిస్తూ గౌరవిస్తూ ప్రోత్సహిస్తూ ఈ పురస్కారాన్ని అందించినట్లుగా నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ తనకు ఈ జాతీయ పురస్కారాన్ని అందించిన సంస్థ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. పలువురు ప్రముఖురు అభినందనలు తెలిపారు.



## ఆత్మచింతన, శాంతి, సేవాభావం, నైతిక విలువలు పెంపొందించడంలో బ్రహ్మ కుమారీస్ సంస్థ కృషి విశేషం

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**కూకట్ పల్లి, జనవరి 27 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, బాలానగర్ డివిజన్ సాయి నగర్ లో బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మితమైన "విశ్వ శాంతి భవనం" ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, బ్రహ్మ కుమారీస్ రూరల్ వింగ్ వైస్ చైర్మన్ డాక్టర్ బి.కె.రాజు భైజి తో కలిసి నూతన భవనాన్ని, ధ్యాన కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చైతన్యం, మానవ విలువలు, శాంతి సందేశాన్ని సమాజానికి విస్తృతంగా చేరవేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ భవనం, ప్రజలకు మార్గదర్శకంగా నిలవనుందన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ గత అనేక దశాబ్దాలుగా ఆత్మచింతన, శాంతి, సేవాభావం, నైతిక విలువలు పెంపొందించడంలో విశేష పాత్ర పోషిస్తూ, సమాజంలో శాంతి సౌహార్దాలను బలోపేతం చేస్తోంది. ఈ "విశ్వ శాంతి భవనం" ద్వారా యువతకు, మహిళలకు, సామాన్య ప్రజలకు ఆధ్యాత్మిక అవగాహన, ధ్యానం, నైతిక జీవన విధానం పట్ల ప్రేరణ లభించనుంది. ఈ మహత్తర సేవా కార్యక్రమానికి తోడ్పడిన బ్రహ్మకుమారీస్ నిర్వాహకులకు, సేవాదారులకు, భక్తులకు నా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, బ్రహ్మ కుమారీస్ ఇంచార్జి బి.కె.సరోజినీ, బి.కె.జ్యోతి, బి.కె.మంజు, బి.కె.మాధవి, బి.కె.సత్యనారాయణ, బి.కె.సుధాకర్, బి.కె.నాందేవ్, నాయకులు వెంకటేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుగుణంగా నామినేషన్ల స్వీకరణ

**ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో వస్తుంది**

**ఫిబ్రవరి 11వ తేదీ న ఎన్నికలు**

**ఫిబ్రవరి 13వ తేదీన ఓట్ల లెక్కింపు**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 27(ప్రభాత ఉదయం):**

మున్సిపాలిటీ ఎన్నికలకు ఈనెల 28వ తేదీ నుండి నామినేషన్లు స్వీకరణ ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు.రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలన మేరకు మున్సిపాలిటీకలకు నిర్వహించనున్న సాధారణ ఎన్నికల నిర్వహణకు చేపట్టవలసిన ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశం మందిరంలో మంగళవారం, సిబ్బంది, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ (బుధవారం) ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని తెలిపారు జనవరి 30, 2026 వరకు నామినేషన్లు స్వీకరణ చివరి తేదీ అని తెలిపారు, జనవరి 31వ తేదీ న నామినేషన్ల ( స్క్రూట్నీ) పరిశీలన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 3వ తేదీ న నామినేషన్లు ఉపసంహరణకు గడువు ఉంటుందని అన్నారు.ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 13 వ తేదీన ఉదయం 8.00 గంటల నుండి ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామని తెలిపారు.ఎన్నికల ను పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు, నామినేషన్లు స్వీకరణ లో నిబంధన ప్రకారము సమయం పాలన తప్పక పాటించాలని తెలిపారు. ఎలాంటి పొరపాటుకు తావులేకుండా నామినేషన్లు స్వీకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు .విధులు కేటాయించిన సిబ్బందికి ఎన్నికల నిర్వహణ నిబంధనల పై మాస్టర్ ట్రైనర్స్ ఎన్నికల నిబంధనలపై మరియు పలు సూచనలు సలహాలు చేశారు.ఈ కార్యక్రమంలో అదరపు కలెక్టర్ పింకేష్ కుమార్, స్టేషన్ ఘన్పూర్, జనగామ మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, విధులు కేటాయించిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

## ఎఐ సాయంతో తను పోలిన నకిలీ మూవీ

**ఢిల్లీ హైకోర్టులో అకీరా నందన్ పిటిష్**

**న్యూఢిల్లీ, జనవరి 27 (ప్రభాత ఉదయం)**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమారుడు అకీరా నందన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి రూపొందించిన ఓ సినిమాతో తన వ్యక్తిత్వం, గోప్యతా హక్కులను ఉల్లంఘించారని తన పిటిషన్‌లో ఆరోపించాడు. ఏఐ మార్ఫింగ్ డీప్ ఫేక్ టెక్నాలజీతో రూపొందించిన ఈ సినిమాలో తన ముఖ కవళికలు, స్వరం, వ్యక్తిత్వాన్ని ఉపయోగించారని పిటిషన్‌లో అకీరా పేర్కొన్నాడు . ఏఐ సినిమాతో పాటు, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్‌లలో పెద్ద సంఖ్యలో తన పేరుతో నకిలీ ప్రొఫైల్స్, సోషల్ మీడియా పేజీలు ఉన్నాయని, వాటిని తొలగించాలని హైకోర్టును అకీరా నందన్ అభ్యర్థించాడు. అతడి పిటిషన్ స్వీకరించిన హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఎఐ సాయంతో తీసిన ఓ లవ్ స్టోరి సినిమాపై హైకోర్టు నిషేధం విధించింది. కృత్రిమ మేధస్సు, డీప్ ఫేక్ సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా అకీరా నందన్ పేరు, ఇమేజ్, పోలిక, స్వరం, వ్యక్తిత్వాన్ని ఉపయోగించడం దోపిడీ చేయడమేనని హైకోర్టు వ్యాఖ్యానించింది.

# క్రీడలు శారీరక మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయి

**యువత క్రీడల పై ఆసక్తి పెంపొందించుకోవాలి.. టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**

**కూకట్ పల్లి, జనవరి 27 (ప్రభాత ఉదయం)**

క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసాన్ని పెంపొందింప చేస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ పరిధి ఇందిరాగాంధీ పురంలో కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ జహంగీర్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జరిగాయి. ఈకార్యక్రమాలకు ముఖ్య అతిథిగా టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ హాజరయ్యారు. విజేతలకు ట్రోఫీలు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నేటి యువత క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంపొందించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుక్కల రమేష్, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, వరహాల స్వామి, నవాబ్, వినయ్, హమీద్, నర్సింగ్, అహ్మద్ ఖాన్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేయాలి


## జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్




**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 27 (ప్రభాత ఉదయం)**

గ్రామపంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించినట్లే మున్సిపల్ ఎన్నికలను కూడా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్లో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలతో పోలిస్తే మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య కొంచెం తక్కువగా ఉన్నప్పటికీ ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటర్లకు ఎన్నికలపై అవగాహన ఎక్కువగా ఉంటుంది కాబట్టి తప్పిదాలు చోటు చేసుకోకుండా పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగేలా ఆయా జిల్లాల ఎన్నికల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ వీసీ అనంతరం జిల్లా ఎన్నికల అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని నాలుగు పురపాలికల్లో నామినేషన్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల నిర్వహణపై అన్ని మున్సిపాలిటీల అధికారులతో తరచూ టెలీ, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల పరంగా పోటీ చేసే అభ్యర్థులకు ఆయా పార్టీల గుర్తులు కేటాయించడం జరుగుతుందని, మిగతా ప్రక్రియ మొత్తం గ్రామపంచాయతీ ఎన్నికల మాదిరే ఉంటుందన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికీ మాస్టర్ శిక్షకులు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేసేందుకు అవసరమైన పోలీస్ బందోబస్తు నియమించనున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతల విషయంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






## గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారు??

**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 27(ప్రభాత ఉదయం)**

బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన స్థానిక ఎమ్మెల్యే అదే పార్టీ కండువా వేసుకుని తిరగాలని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మంగళవారం గద్వాలలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత పదేళ్లుగా గద్వాల అభివృద్ధికి నోచుకోలేదని, మున్సిపాలిటీలో పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు పిల్లిగుండ్లలో 3 వేల మందికి పట్టాలు పంపిణీ చేశానని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రైవేటు భూములు కొనుగోలు చేసి, సొంత నిధులు అదనంగా ఖర్చు చేసి 78 ఎకరాల భూమి సేకరించి పేదలకు ఇండ్ల స్థలాలను అందించారని తెలిపారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు తెలుసని, బీఆర్ఎస్ పార్టీలో ఉంటే ఆ పార్టీ నుండి పార్టీ టికెట్స్ అందజేయాలి కానీ ఆయన కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారని ఆమె విమర్శించారు. అభివృద్ధి కోసం అధికార పార్టీకి ఓటు వేయమంటున్నారు... ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటు అడిగే హక్కులేదని, సొంత స్థలం ఉంటేనే ఇండ్లు ఇస్తామని చెబుతూ పట్టణ ప్రజలను పదేపదే మోసం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. గద్వాల చీరలకు మంచి ప్రాముఖ్యత వున్నా చేనేత పార్కు అభివృద్ధి కి ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 21 వేల ఓట్ల మెజారిటీ ఇచ్చిన గద్వాల ప్రజలు ఇప్పుడు మున్సిపాలిటీలో కూడా అదే తీరుగా మద్దతివ్వాలని ఆమె కోరారు.తెలంగాణలో మున్సిపాలిటీ ఎన్నికల షెడ్యూల్ త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో గద్వాల మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని,పట్టణ ప్రజలు కులమత భేదాలు లేకుండా బీజేపీకి ఓటు వేసి అభివృద్ధి మార్గంలో గద్వాలను తీసుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి వార్డులో బీజేపీ విజయ డంఖ మోగించాలని,టికెట్ ఎవరికి వచ్చినా అందరూ కలిసి పార్టీ విజయానికి కృషి చేయాలి అని ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైద్యం సహకారంతో శరీరంలోని దీర్ఘకాలిక వ్యాధులను నివారించుకోవచ్చు



వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి27(ప్రభాత ఉదయం)**

ప్రకృతి వైద్యం సహకారంతో శరీరంలోని దీర్ఘకాలిక వ్యాధులను నివారించుకోవచ్చని గద్వాల జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర అన్నారు . తెలంగాణ ప్రభుత్వ యోగాధ్యాయన పరిషత్ , ఆయుష్ శాఖ కొణిజేటి రోశయ్య నేచర్ క్యూర్ హాస్పటల్ వారి సహకారంతో మంగళవారం జోగుళాంబ గద్వాల్ జిల్లా ఆసుపత్రిలో ఆయుష్ ప్రకృతి శిభిరం లో నాచ్యురోపతి వైద్యం మరియు యోగా శిబిరం నిర్వహించారు.ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన శిబిరంలో రోగులకు అక్యుపంచర్, ఫిజియోథెరపీ, డైట్ కౌన్సెలింగ్, యోగా పై అవగాహన కల్పించారు. డాక్టర్ మాధవి లత మాట్లాడుతూ మన రోజు వారి ఆహారపు అలవాట్లు ఎలా ఉండాలో, జీవన శైలి పద్ధతుల మరియు ప్రకృతి చికిత్సలో ఇవ్వబడే మట్టి చికిత్స, జలవైద్యం, థెర్పెటిక్ యోగా, ఆక్యుపంచర్, ఉపయోగాలు గురించి తలిపారు. డాక్టర్ బాలకొండయ్య మాట్లా డుతూ నేచురల్ జీర్ణశక్తిని, రోగనిరోదక శక్తిని పెంపొందించుకోవచ్చు అని చెప్పారు. శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు. దీర్ఘకాలిక ఈ కీళ్ల నొప్పులు, జీర్ణాశయ సమస్యలు, మెడ మరియూ నడుము నొప్పుల చికిత్స అందించారు. అవగాహన కల్పించేందుకు రాగి, నువ్వుల లడ్డూలు, జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు మొదలగు సిరిదాన్యాలను అందించారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వైద్య హాస్పటల్ వైద్యులు డాక్టర్ మధవీలత, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా, ఆర్ఎంఓ డాక్టర్ బాలకొండయ్య, ఆయుష్ మందిర్ డాక్టర్ సులేఖ, జూనియర్ డాక్టర్లు వైష్ణవి, ప్రణీత,నిర్చిత రెడ్డి, భావన, అమిత,ఆదర్ష్, రుత్విక, హారిక పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తాం పాలమూరు ఎంపీ డీకే అరుణ

**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 27(ప్రభాత ఉదయం)**

దేశం బీజేపీతోనే అభివృద్ధి జరుగుతుందని, అందరూ బీజేపీ వైపు చూస్తున్నారని మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో విజ యఢంకా మోగిస్తామన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ లలో పోటీ చేసేందుకు బీజేపీ అభ్యర్థులు సిద్ధమయ్యారని ఆమె తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను పెద్ద ఎత్తున గెలిపించాలని పట్టణ ప్రజలను కోరారు. పదేండ్లలో గద్వాలలో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. ఇవ్వాళ గద్వాలమున్సిపాలిటీలలో పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉందని, ఇండ్లు లేని నీరుపేదలకు ప్రభుత్వాలు అన్యాయం చేస్తుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు గద్వాలలోని పిల్లిగుండ్లలో మూడువేల మంది నిరుపేదలకు ఇండ్ల పట్టాలు పంపిణి చేయడం జరిగిందన్నారు.ప్రైవేటు భూములు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసి.. మార్కెట్ రేటు ప్రకారం ఇవ్వాలని భావించి.. సొంత నిధులు అదనంగా ఖర్చు చేసి 78 ఎకరాల భూమి కొనుగోలు చేసి పేదలకు పట్టాలు పంపిణీ చేసినట్లుతెలిపారు.ప్రస్తుత గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారో.. కాంగ్రెస్ లో ఉన్నారో ప్రజలకు తెలుసు అని అన్నారు.ఒక వేళ గద్వాల ఎమ్మెల్యే బీఆర్ఎస్ అయితే ఆ పార్టీ నుంచి ఓట్లు అడగాలి.. కానీ కాంగ్రెస్ పార్టీ నుంచి ఓట్లడగడం సిగ్గు చేట్టన్నారు. ప్రస్తుతం గద్వాలఎమ్మెల్యే కాంగ్రెస్ లో కొనసాగుతున్నారని స్పష్టం అవుతోందని, అభివృద్ధి కోసం అధికార పార్టీకి వెళ్ళమని అంటున్నారు.. ఏం అభివృద్ధి చేశారో గద్వాల ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.లిప్రజలకు పంపిణీ చేసిన ప్లాట్ల పట్టాలు లాక్కొని.. డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మిస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో ఆశ చూపెట్టి గద్దెనెక్కిన ఎమ్మెల్యే ఇప్పటికి ఆ పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కూడా ఇవ్వలేకపోయారన్నారు.గద్వాల లో ఆసుపత్రికి, స్కూల్ కి, కాలేజికి అన్నింటికి ఆ భూమిని వినియోగిస్తున్నారు.తన హయాంలో 2లక్షల ఎకరాలకుసాగు నీళ్లు అందించేందుకు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాన్ని కొట్లాడి తీసుకువస్తే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తామే చేసిందని గొప్పోలు చెప్పుకోవడం విడ్డూరం అని, అలా చెప్పుకోవడానికి వాళ్ళది నోరా ,మోరా అర్థం కావడం లేదని మండిపడ్డారు.రాష్ట్ర ప్రభుత్వం స్థలం లేని వాళ్లకు స్థలం తో పాటు.. ఇండ్లు నిర్మించి ఇవ్వాలి అని అన్నారు.గద్వాల చీరలకు మంచి వ్యాపారం ఉన్న.. చేనేత పార్కు మాత్రం ఎక్కడి గొంగడి అక్కడే అన్నట్లు ఉంది.

**అభివృద్ధి ఎవరు చేశారో ప్రజలకు తెలుసు..**

పార్లమెంట్ ఎన్నికల్లో 21 వేల ఓట్ల బీజేపీ కి మెజారిటీ ఇచ్చారు అని,కుల మత బేధం లేకుండా బీజేపీని గెలిపించండి.గద్వాల అభివృద్ధి కుంటుపడటం చూస్తే బాధ కలుగుతుందన్నారు.కొట్లాడి గద్వాల జిల్లా కేంద్రాన్ని సాధించుకున్నాం అని,డబ్బులకు,ప్రలోభాలకు ప్రజలు ఓటు అమ్ముకోవద్దని సూచించారు. పని చేసే వ్యక్తులు ఎవరు అని ఆలోచింది ఓటు వేయాలని కోరారు.గెలుపు అవకాశాలు ఎవరికి ఉన్నాయో ఆలోచించి పార్టీ టిక్కెట్ ఇస్తుంది అని అన్నారు.టిక్కెట్ ఎవరికి వచ్చినా అందరూ కలసి బీజేపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.




## బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

**గద్వాల ప్రతినిధి, జనవరి 27(ప్రభాత ఉదయం)**

బాల్య వివాహల నిర్మూలన అందరు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి నరసింహ , సీడీపీఓ ఆకాశ దీప్తి అన్నారు. మంగళవారం గద్వాల మండలం పూడూర్ లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మహిళా , శిశు సంక్షేమ శాఖ, 1098 చైల్డ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త భారత్ 100 రోజుల కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ముక్కుపచ్చలారని ఆడపిల్లలకు మూడుముళ్లతో భవిష్యత్ నాశనం చేయవద్దని, చదువు, క్రీడలు, సాంస్కృతిక రంగాలలో వారు రాణించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాలు మరియు వాటి వాళ్ళ జరిగే అనర్తల గురించి అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహాలకి సంబంధించి సమాచారం తెలిసినట్లుయితే 1098 ద్వారా సమాచారం అందించాలని సూచించారు. అలాగే ఆపదలో ఉన్న బాలల కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 అను టోల్ ఫ్రీ నెంబర్ దేశవ్యాప్తంగా పనిచేస్తుందని, 24 గంటలు సేవలు అందించే ఉచిత హెల్ప్ లైన్ నెంబర్ అని అన్నారు. పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని ఆకాంక్షించారు. మీరు ఏలాంటి సమస్యలు వచ్చినా చదువు మాత్రం ఆపకూడదని, భవిష్యత్తులో స్థిర పడటానికి ఉపయోగపడే ఏకైక అయోధం చదువు కాబట్టి ఎన్ని అడ్డంకులు వచ్చిన చదువు మనివేయకూడదని సూచించారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ శివలీల, సూపర్వైజర్ దస్తగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ, సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

## టీఆర్పీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎం డీ మహమ్మద్ పాషా (బబ్బులు)



**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 27(ప్రభాత ఉదయం):**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ ఆమోదంతో, జిల్లా అధ్యక్షురాలు చెరుకూరి మౌనిక యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదరి సతీష్ ముదిరాజ్ వారి సూచన మేరకు... జిల్లా మైనార్టీ అధ్యక్షులుగా యం.డి మహమ్మద్ పాషా (బబ్బులు)ని నియమించారు. మంగళవారం జనగామ జిల్లా కార్యాలయంలో ఎన్నికైన యం.డి మహమ్మద్ (బబ్బులు) కు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జిట్టబోయిన నరేష్ నియామక పత్రాన్ని అందజేసి చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ జిల్లా అధ్యక్షులు మంద దిలీప్, అపట్టణ అధ్యక్షులు గడ్డం కృష్ణ, యూత్ నియోజకవర్గ అధ్యక్షులు బోడా రమేష్, జలీల్ పాషా, మహ్మద్ అస్లాం, అబ్దుల్ రహీం, రాజు, లక్ష్మణ్, రాజేందర్, ప్రశాంత్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608